క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



ట్రేడ్ లైసెన్స్ పత్రాలు అందజేస్తున్న కమిషనర్ సాబేర్ అలీ

తుర్కయంజాల్: మున్సిపాలిటీ అభివృద్ధిలో వ్యాపారులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ కోరారు. బుధవారం ఢాల్ఫిన్ ఫుడ్ ఇండస్ట్రీస్ యజమానులు కమిషనర్ సాబేర్ అలీకి వ్యాపార లైసెన్స్ ఫీజుకు సంబంధించిన చెక్కును అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. వ్యాపారస్తులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాపార లైసెన్స్‌లను తీసుకోవడంతో పాటు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో జరిమానాలు విధించడంతో పాటు దుకాణ సముదాయాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మీర్‌పేట: జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్త యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు.

సురేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి: నర్సింహ

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని కుంట్లూర్ చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన మత్స్యకారుడు జోర్క సురేందర్(49) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం చెరువు తూమును మూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మృతిచెందిన జోర్క సురేందర్ మృతదేహానికి ఆయన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, అబ్దుల్లాపూర్‌మెట్టు మండల అధ్యక్షుడు పొన్నాల శంకర్, నాయకులు శ్రీరాములు, శ్రీనివాస్, వేణు, రాము, లక్ష్మణ్, సురేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం

కడ్తాల్: కడ్తాల్ మండలం కొండ్రిగానిబోడ్‌తండా పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువు తండాకు చెందిన నిరుపేద లక్ష్మీ–రాజు దంపతుల కూతురు వైశాలి వివాహం ఈనెల 7న జరుగనుంది.పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.20,116 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, ఉపసర్పంచ్ శారదపాండునాయక్, నాయకులు రాజునాయక్, గణేశ్, టిక్‌లాల్, నరేశ్ తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠాపన ఉత్సవాలు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని తట్టి అన్నారంలోని లలితా భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగే ధ్వజస్తంభ, శిఖరాల, శక్తిపీఠాలు పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గురువారం వాస్తుపూజ, హోమం ఉంటుందని, శుక్రవారం యంత్ర స్థాపన, మహా పూర్ణాహుతి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కూకుట్లపల్లి మహేందర తెలిపారు.

కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. తెలంగాణ జాక్ నాయకులు సదానందంగౌడ్‌తో పాటు, సీనియర్ కార్యదర్శులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు బాలరాజు, రాఘవేందర్, అలివేలు, యాదగిరి, శరత్, వాజిద్, శేఖర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీరాజ్ కార్యదర్శులు చేపట్టిన బుధవారం 6వ రోజుకు చేరుకుంది. ఎంపీపీ కృపేశ్ కార్యదర్శుల శిబిరానికి చేరుకుని సమస్యలను తెలుసుకున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎంపీపీ కృపేశ్‌కు కార్యదర్శులు వినతి పత్రం అందించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ కార్యాద్శులకు హామీ ఇచ్చారు.

మైసమ్మ ఆలయంలో అన్నదానం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రంలోని శ్రీ బంగారు మైసమ్మ కాశీ వైద్య నాదేశ్వరా దేవాలయంలో నిత్యాన్నదానం మొదలు పెట్టి నేటికీ సంవత్సరం అవుతున్న సందర్భంగా బుధవారం దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వర్లు, లత, నోముల కబీరదాస్, రేణుక, మెడికల్ ఆఫీసర్ డా.అర్చన సహాయంతో 1000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్‌తెలిపారు. కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

శరవేగంగా 'మార్కెట్' పనులు

- రూ.4.50 కోట్లతో అన్ని హంగులతో నిర్మాణం
- ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పనుల్లో వేగం
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



నిర్మాణ దశలో ఆమనగల్లు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆమనగల్లు పట్టణంలో కూరగాయలు, మాంసం, చేపలు విక్రయించడానికి ప్రత్యేకస్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని హనుమాన్ దేవాలయం సమీపంలోని పోలీసు స్టేషన్ వెనుకభాగంలో రోడ్డుపై కూరగాయలు, చేపలు, పలుచోట్ల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో మార్కట్ యార్డు నిర్మించాలని పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మార్కెట్ ఏర్పాటుకు కృషిచేస్తానని వ్యాపారులకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకుపోగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంజూరుచేసింది. తదనంతరం మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మార్కెట్‌ను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పరిశీలిస్తూ పనులను మరింత వేగంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వివాదాస్పదంగా నిర్మాణ స్థలం..

మార్కెట్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదంగా మారింది. దీనికి కారణం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న ఖాళీస్థలాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డుకోసం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎంపికచేయడమే. అయితే మార్కెట్‌యార్డులో కాకుండా ఆమనగల్లు పట్టణంలో ప్రజలకు అనుకూలమైన స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించాలని ఆమనగల్లు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. అయినప్పటికీ మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం 1.04 ఎకరాల భూమిని కేటాయించింది. దీంతో 2021 నవంబర్ 8న రాష్ట్ర మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆలస్యంగా పనులు ప్రారంభం..

ఇంటిగ్రేటెట్ మార్కెట్ నిర్మాణానికి 2021లో శంఖుస్థాపన చేసినప్పటికీ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని టెండర్ ప్రక్రియను త్వరితగతిన ముగించి పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో నాలుగు నెలల క్రితం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే..



స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా మార్కెట్ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– అనురాధ, జెడ్పీటీసీ, ఆమనగల్లు

ఉచిత వాటర్ ప్లాంట్లు అభినందనీయం

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్

ఆమనగల్లు: ప్రజలకు సురక్షిత తాగునీటినే తాగాలని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో రాష్ట్ర రజక యువజన సంఘం ఉపాధ్యక్షుడు నాగిళ్ల జగన్ ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో జగన్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా తోటివారికి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, స్థానిక నాయకులు కిశోర్, కుమార్‌గౌడ్, అబ్దుల్ రజాక్, మజీద్, నిరంజన్, వెంకటయ్య, మల్లయ్య, పురుషోత్తం, మహేశ్, శేఖర్, వినోద్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామపరిధిలోని అయ్యసాగరంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్, సభ్యులు ధనలక్ష్మి, వెంకటేశ్, రజిత, సునీత, పద్మ, కిశోర్, రవికాంత్, సాహితీ, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

ఎంపీపీ నిర్మల

తలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీతో పాటు, పీడీ ప్రభాకర్, అడిషనల్ డీఆర్‌డీఓ నీరజ, ఎస్ఆర్‌పీ భద్రునాయక్ హాజరయ్యారు. శాట్ (ఎస్ఎస్ఏఏటీ)ఆధ్వర్యంలో మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై డీఆర్పీలు సర్వే నిర్వహించారు. ఖర్చుపెట్టిన నిధులు–చేపట్టిన పనులపై ఆరా తీశారు. ప్రజలను అడిగి వాస్తవ విషయాలు తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏపీడీ గౌతమ్‌చరణ్, ఎంపీడీఓ శ్రీకాంత్, విజిలెన్స్ ఆఫీసర్ కొండయ్య, ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, టీఏ, ఎఫ్ఎ, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య



చిన్నారులకు బాలామృతం అందిస్తున్న సర్పంచ్ అనురాధ

ఆమనగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వప్రాథమిక విద్య అందిస్తున్నట్లు కొల్కులపల్లి గ్రామ సర్పంచ్ బట్టు అనురాధ అన్నారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రం–1లో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించిన చిన్నారులకు సర్పంచ్ బట్టు అనురాధ ప్రతిభా కార్డులను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సత్యమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం



విరాళం అందజేస్తున్న మర్రి నిత్యా నిరంజన్ రెడ్డి దంపతులు

మంచాల: ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఆంబోత్ తండాలో జరిగే బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యా నిరంజన్‌రెడ్డి దంపతులు బుధవారం రూ.51 వేలు విరాళంగా అందించారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. సర్పంచ్ ఆంబోత్ రఘునాయక్, ఉపసర్పంచ్ రాజునాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిచ్చు నాయక్, శ్రీనివాస్, హరిలాల్, శివ, రాములు సీతారాం, హరికృష్ణ, రవి, కిషన్,కుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రతకు యువత పాటుపడాలి



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్

హయత్‌నగర్: ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న మతతత్వ శక్తులను తరిమికొట్టి, జాతీయ సమగ్రతకు యువత కృషి చేయాలని జాతీయ యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సమాఖ్య 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన హయత్‌నగర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాల సాధన కోసం 1959లో అఖిల భారత యువజన సమాఖ్య ఆవిర్భవించిందని,18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కును కల్పించాలని పోరాటం చేసి విజయం సాధించామన్నారు. సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలలో స్థానిక యువతకు 50శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రకృతి సంపదను దోచుకుంటూ సంపాదనే మార్గంగా పని చేస్తున్న కార్పొరేట్ శక్తులకు అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి. లక్ష్మణాచారి, నియకులు దేవేందర్, రమేష్, శ్రీకాంత్, వెంకటేష్, శోభన్, అశోక్ పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తికి బీజేపీ తూట్లు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్



సంస్మరణ సభలో రవికుమార్, నాయకులు

మహేశ్వరం: మేడే స్ఫూర్తికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మేడే సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ సంస్మరణ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పని చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. నరేంద్రమోడీ గత తొమ్మిదేళ్ల పాలనలో స్వదేశీ, విదేశీ పారిశ్రామిక ఆర్థికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. 8 గంటల పనిదినాలను 12 గంటలకు పొడిగించేందుకు, పనిభారం పెంచేందుకు శ్రీకారం చుట్టారన్నారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉద్యోగ రక్షణ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ జి.కవిత, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళ్‌పల్లి–2 ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంగల్‌పల్లి, సాహెబ్‌గూడ గృహ వినియోగదారులకు, అదేవిధంగా మంగల్‌పల్లి, పోచారం పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో హోమం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనృసింహస్వామి ఆయయంలో స్వామివారి జయంతి, కల్యాణోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. గురువారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగలరని కోరారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం: తహసీల్దార్

యాచారం: నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపుతామని యాచారం తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. నల్లవెల్లి, బొల్లిగుట్టతండా, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాలకు చెందిన 6 మందిని నాటుసారా తయారీ కేసులో యాచారం పోలీసులు బుధవారం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇకనుంచి నాటుసారా తయారీచేస్తే రూ.లక్ష జరిమానా విధించి, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. ప్రభుత్వం నాటుసారా తయారీని నిషేధించినప్పటికి మళ్లీ తండాల్లో తయారీ చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని ఏ గిరిజన తండాలో ఐనా నాటుసారా తయారుచేస్తే ఆ గ్రామ ప్రజలు వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రూ.4లక్షల నిధుల ప్రొసీడింగ్ అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని 2వ వార్డులో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.2లక్షలు, 3వ వార్డులో నిర్మించే అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ.2లక్షల మండల పరిషత్ నిధులను ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు రూ.4లక్షలకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను స్థానిక నాయకులకు గురువారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, వార్డుసభ్యులు మల్లయ్య, భిక్షపతి, శ్రీను, రమేశ్, రాంచందర్‌నాయక్, ఇమ్రాన్ బాబా తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ నిరసన సభకు తరలిరండి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ఈనెల 8న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తలు సమావేశానికి మండల కేంద్రం నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చేయూత

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన జోన్‌యాదయ్య, అంజయ్య, పరికింటి యాదగిరి, ఎనీ రామస్వామి, సేరి సాయిరాం, చేగూరి విజయమ్మ ఇండ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వారి సమస్యను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆయా ఇళ్ల నిర్మాణాలకు బుధవారం సిమెంట్‌ను ఉచితంగా అందజేశారు. మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు రవికుమార్, శేఖర్, రాములు, తిరుపతినాయక్, రమేశ్, కృష్ణయాదవ్, మోదీన్, రాజు ఉన్నారు.

కృష్ణయ్య ఇంటి నిర్మాణానికి..

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నాడు. మండల పరిధిలోని చంద్రధనకు చెందిన వడ్ల కృష్ణయ్య ఇంటి నిర్మాణానికి బుధవారం ట్రస్టు సభ్యులచే ఇసుక, స్టీల్, ఇటుక, సిమెంట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇవేకాక పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఉపసర్పంచ్ సుధాకర్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, నర్సింహ పాల్గొన్నారు.

చికిత్సతో ఆస్తమాకు చెక్

సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి



ఆస్తమా స్క్రీనింగ్ క్యాంపులో మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

మన్సూరాబాద్: ఆస్తమా చంపేసే రోగం కాదని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే నియంత్రించుకోవచ్చని సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రపంచ ఆస్తమా మాసోత్సవాల సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లోని ఇందిరా ఆడిటోరియంలో అందరికీ ఆస్తమా వైద్యం– ఉచిత ఆస్తమా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయనతో పాటు కామినేని హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ గాయత్రి కామినేని, సీనియర్ పల్మానాలజిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ, వైద్యం కంటే ముందు రోగిలో మనోధైర్యాన్ని నింపితే సగం జబ్బు నయమవుతుందన్నారు. ఆస్తమాతో తాను ఇబ్బందులు ఎదుర్కొన్నానని వైద్యుల సూచనలు, సలహాలతో 90శాతం మేర ఉపశమనం లభించిందని చెప్పారు. ఆరేళ్ల వయస్సు నుంచే దగ్గు ఆయాసం వచ్చేదని, ధృఢ సంకల్పంతో వైద్యుల సలహాలు సూచనలతో ఆస్తమాను జయించవచ్చునేందుకు తానే నిదర్శనమన్నారు. కామినేని హాస్పిటల్స్ సీనియర్ పల్మానాలజిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, ఆస్తమా వ్యాధిపై అవగహన ఉంటే విముక్తి పొందవచ్చని, ప్రజల్లో మరింత అవగహన కల్పించేందుకు ఉచిత ఆస్తమా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఈ నెల 3 నుంచి 6వ తేది వరకు కామినేని హాస్పిటల్స్‌లో నిర్వహిస్తున్న ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, లక్నో చికాన్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రికి భైరాగిగూడవాసుల వినతి



మంత్రిని కలిసిన భైరాగిగూడవాసులు

కందుకూరు: మండల పరిధిలోని భైరాగిగూడకు చెందిన వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సమీర్, మైనార్టీ బ్లాక్ ప్రెసిడెంట్ దావూద్, నాయకులు కుమార్, సర్వర్, వార్డు సభ్యులు నరేందర్, పరమేశ్వరి, భగవంత్, మైసయ్య, రాము, శివప్రసాద్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.